సాక్షి నిజామాబాద్

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



పదేళ్లలో పలకరించింది లేదు

కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలో ఎన్నడూ రైతులను పలకరించలేదని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విమర్శించారు.

- 8లో ▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.9 /27.1

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవీపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని జన్నెపల్లిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 466 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 140 కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సకాలంలో మిగిలిన కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పా రు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీఏవో పాపయ్య, క్లస్టర్ ఆఫీసర్ జియాఉద్దీన్, బినోల సొసైటీ సీఈవో రమేశ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాలువ మరమ్మతులు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ సమీపంలో గల నిజాంసాగర్ కెనాల్ కట్టకు మరమ్మతులు కొనసాగుతున్నాయి. రెండో రోజూ జేసీబీ సహాయంతో పనులు నిర్వహించారు. సోమవారం తెల్లవారు జాయిన కాలువ తెగిపోయి కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరిన విషయం తెలిసిందే. కాగా అధికారులు ఇప్పటివరకు తమకు ఎలాంటి సహాయం చేయలేదని బాధితులు పేర్కొన్నారు.

నేడు సైబర్ జాగృతి దివస్

ఖలీల్‌వాడి: సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సైబర్ నేరాల సంఖ్య అదేస్థాయిలో పెరిగి పోయిందని, వాటిని అరికట్టడానికి ప్రతి నెలా బుధవారం సైబర్ జాగృతి దివస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సమర్థవంతంగా సేవలందించడమే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. సాంకేతిక పద్ధతులకు తగ్గట్టుగా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ క్రైం యూనిట్ల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఎవరైనా సైబర్ నేరాగళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మోసపూరిత లావాదేవీలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే వాటిని తక్షణం నిలిపివేసి సంబంధిత ఖాతాను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సైబర్ నేరాల కేసుల్లో పూర్తిస్థాయి ఆధారాలను సేకరించి నేరస్తులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆదేశాల మేరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించాలని పేర్కొన్నారు.

ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూషన్ పేరుతో మోసం

- సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో మొదటి కేసు నమోదు



ఖలీల్‌వాడి: ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూషన్ ఇస్తామని నమ్మించి ఆన్‌లైన్‌లో దుండగులు రూ. 6 లక్షల సైబర్ మోసానికి పాల్పడ్డారు. బాధితుడు మంగళవారం సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా కేంద్రంలో ప్రత్యేక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ప్రారంభించిన తర్వాత నమోదైన మొదటి కేసు ఇదే. బాధితుల నుంచి సీపీ కల్మేశ్వర్ ఫిర్యాదు స్వీకరించారు. రూ.లక్షకు పైగా మోసానికి సంబంధించిన ఫిర్యాదులను సైబ్ క్రైం స్టేషన్‌లో అందజేయాలని, అంతకు తక్కువ మొత్తానికి సంబంధించిన ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్‌లలో అందజేయాలని సీపీ సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్‌మోసాలకు గురైనవారు పోలీస్‌స్టేషన్ (08462-227433), ఏసీపీ (87126 65554), సీఐ (87126 65587)ను సంప్రదించాలన్నారు.



డొంకేశ్వర్ మండలం గాదేపల్లి వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

ఊపందుకున్న ఉపాధి

జిల్లాలో ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. వ్యవసాయ పనులు తగ్గడంతో గ్రామీణ ప్రజలు 'ఉపాధి' బాట పట్టారు. దీంతో రెండు మూడు రోజులుగా పనులకు వచ్చే కూలీల సంఖ్య రెట్టింపయ్యింది. అయితే వేసవి కావడంతో పని ప్రదేశంలో సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు మండుతుండడంతో అధికారులు పనివేళలు మార్చారు.

- జిల్లాలో పనుల జాతర
- మంగళవారం రికార్డుస్థాయిలో 43 వేల మంది కూలీల హాజరు
- చెరువుల్లో జోరుగా గుంతల తవ్వకం

డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వారం రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా 20వేలు మించని కూలీల హాజరు ఇప్పుడు రెండింతలైంది. మంగళవారం రికార్డు స్థాయిలో 43,352 మంది పనులకు వచ్చారు. అత్యధికంగా నందిపేట్ మండలంలో 3,681మంది హాజరయ్యారు. అయితే, గ్రామ పంచాయతీల్లో మరింత మంది కూలీలు పనులకు హాజరయ్యేలా ఈజీఎస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జాబ్ కార్డున్న ప్రతిఒక్కరూ పనులకు రావాలని ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పనులు కూడా పెద్దగా లేకపోవడంతో కూలీలంతా ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. వేసవి మొదలవడంతో ఎండలకు చెరువుల్లో నీళ్లు తగ్గాయి. దీంతో కూలీలంతా చెరువుల్లో గుంతలు తవ్వుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో దూర ప్రాంతాల్లో చేసే పనులకు ట్రాక్టర్ల ద్వారా కూలీలను తరలిస్తున్నారు. కొంతమంది కూలీలు సొంత వాహనాలపై వస్తున్నారు. ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, వర్ని, భీమ్‌గల్, డిచ్‌పల్లి, మాక్లూర్, నవీపేట్, బోధన్, సిరికొండ మండలాల్లో కూడా ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇటు ప్రతి పంచాయతీకి 150 మందికి తగ్గకుండా కూలీలు వచ్చేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలందాయి. అయితే, చందూర్, వర్ని మండలాల్లో మాత్రం 350 మందికి మించి కూలీలు రావడం లేదు.

పనిచేసే చోట వసతులెక్కడ..!

జిల్లాలో ఎండలు సుమారు 42 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. మండుటెండలో ఉపాధి హామీ పనులు చేయడానికి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని అధికారులు పనివేళలను మార్చారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు కూలీలు పనులకు రావాలని సూచిస్తున్నారు. దీంతో వేకువజామునే కూలీలు పనులకు వచ్చి ఎండ ముదరకముందే ఇంటికి వెళ్తున్నారు. కానీ, ఉదయం తొమ్మిది గంటలకే ఎండ తారెత్తిస్తోంది. కూలీలకు పనిచేసే చోట వసతులు కల్పించాలని ఉపాధిహామీ చట్టం చెబుతోంది. జిల్లాలో పనులు జరిగే చోట తాగునీరు, మెడికల్ కిట్లు, సేద తీరేందుకు టెంట్లు చాలా ప్రాంతాల్లో కనిపించడం లేదు. కూలీలు తమవెంటే నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్ల పంచాయతీ నుంచే నీటి వసతులు కల్పిస్తున్నారు. పనులు చేసే క్రమంలో కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స అందించడానికి చాలా ప్రాంతాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో లేవు. అయితే, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను స్థానిక ప్రభుత్వ పీహెచ్‌సీ నుంచి తెచ్చుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఈజీఎస్ అధికారులు ఆదేశాలిచ్చారు.

మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుతాం



వేసవి ఉపాధిహామీ పనులు వేగం పుంజుకున్నాయి. వారం రోజుల్లోనే కూలీల హాజరు శాతం చాలా పెరిగింది. ప్రతి జీపీకి 150 మందికి తగ్గకుండా కూలీలు పనులకు వచ్చేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చాం. పనులు జరిగే చోట నీటి, మెడికల్ కిట్లు వసతులు కల్పించడానికి చర్యలు చేపడుతున్నాం.

– సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులు

- ఏజెంట్లతో కుమ్మక్కవుతున్న కొందరు ఎస్‌బీ అధికారులు
- ఖతర్ వెళ్తూ శంషాబాద్ ఎయిర్ పోర్టులో పట్టుబడిన దొన్కల్ వాసి



మోర్తాడ్(బాల్కొండ): శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఖతర్‌కు వెళ్లే ప్రయత్నంలో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన సాయి అనే యువకుడిని సోమవారం ఇమిగ్రేషన్ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నకిలీ ధ్రువపత్రాలు, తప్పుడు సమాచారం ఇచ్చి ఆ యువకుడు రెండో పాస్‌పోర్టును పొందాడని విదేశాంగ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఫలితంగా సాయి ఖతర్‌కు వెళ్లలేకపోగా చేసిన తప్పుకు కటకటాలు లెక్కించాల్సి వచ్చింది.

గతంలో వేల్పూర్‌కు చెందిన మురళి తప్పుడు ధ్రువపత్రాలతో పాస్‌పోర్టును పొంది దుబాయ్‌కు వెళ్లాడు. అక్కడి ఎయిర్‌పోర్టులో మురళికి గతంలో ఒక పాస్‌పోర్టు జారీ కాగా మరోసారి తక్కువ వయస్సును చూపి రెండో పాస్‌పోర్టును పొందాడని దుబాయ్ పోలీసులు గుర్తించి ఇంటికి పంపించారు. కరీంనగర్ కేంద్రంగా సాగిన నకిలీ పాస్‌పోర్టుల వ్యవహారం ఇంకా సద్దుమణగక ముందే దొన్కల్ వాసి అరెస్టు కావడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నా..

పాస్‌పోర్టుల జారీలో విదేశాంగ శాఖ ఎన్నో కఠిన నిబంధనలను అనుసరిస్తోంది. సరైన ధ్రువపత్రాలు లేకుండా పాస్‌పోర్టులను జారీ చేసే వీలు లేదు. కాగా కొందరు ఏజెంట్లు స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) అధికారులతో కుమ్మక్కై నకిలీ పత్రాలను సృష్టించి గతంలో పాస్‌పోర్టు పొందినవారికి మరోసారి వేరే వివరాలతో రెండో పాస్‌పోర్టును ఇప్పిస్తున్నారు. పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, ఎస్‌బీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించి నకిలీ ధ్రువపత్రాలకు పాస్‌పోర్టులను జారీ చేసేలా ఆమోదం తెలుపుతున్నారు. కాగా ఇమిగ్రేషన్ సందర్భంలో నకిలీ పాస్‌పోర్టులు బట్టబయలవుతున్నాయి.

రోహింగ్యాలకు పాస్‌పోర్టులు..

గతంలో జిల్లాలోని బోధన్ కేంద్రంగా రోహింగ్యాలకు ఇక్కడి చిరునామాలపై పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. ఏకకాలంలో 80 మంది రోహింగ్యాలకు ఎస్‌బీ అధికారుల అత్యాశతో పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. స్టేట్ ఇంటలిజెన్స్ విచారణలో ఈ తతంగం బయటపడగా ఈ కేసును గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీరుగార్చిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ఇమిగ్రేషన్ అధికారుల పరిశీలనలో నకిలీ పత్రాలతో జారీ అయిన పాస్‌పోర్టులు బయటపడటం, సంబంధిత యువకులు జైలు పాలుకావడం జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా పోలీసు, ఇంటలిజెన్స్ అధికారులు అప్రమత్తమై నకిలీ పత్రాలతో పాస్‌పోర్టు పొందిన వారిని, ఈ అక్రమాలకు ఊతమిచ్చిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

భారీ మొత్తంలో ముడుపులు..

నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులను జారీ చేసే వ్యవహారంలో భారీమొత్తంలో నగదు చేతులు మారుతోంది. కొందరు ఎస్‌బీ అధికారులు పాస్‌పోర్టు ఏజెంట్లతో చేతులు కలిపి తప్పుడు ధ్రువపత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి పాస్‌పోర్టులు చేతికి అందేలా చేస్తున్నారు. నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులను జారీ చేయడంలో రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ముడుపులను స్వీకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పోలింగ్ విధులపై అవగాహన కలిగి ఉండాలి



పీవోలు, ఏపీవోలకు సూచనలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మే 13న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎలాంటి సందేహాలున్నా మాస్టర్ ట్రైనర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణా తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధుల్లో అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ డే సందర్భంగా పీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై క్లుప్తంగా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన నియమావళి ప్రకారంగా పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈవీఎంలు తీసుకొని పోలింగ్ డే పూర్తయిన తర్వాత సాయంత్రం తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత పీవోలదేనన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, తదితరులున్నారు.

పోలీస్‌స్టేషన్ నుంచి నిందితుల పరారీ

ఖలీల్‌వాడి : దొంగతనం కేసులో విచారణకు తీసుకువచ్చిన ఇద్దరు నిందితులు పోలీసు స్టేషన్ నుంచి పరారయ్యారు. సౌత్ సీఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఇళ్లలో దొంగతనం చేశారనే అనుమానంతో పోలీసులు సోమవారం ఉదయం ముగ్గురిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయితే రాత్రి టౌన్‌లో విధులు నిర్వహించిన పోలీసులు మంగళవారం తెల్లవారుజామున నిర్లక్ష్యంగా ఉండటాన్ని గమనించిన ఇద్దరు నిందితులు స్టేషన్ నుంచి పరారీ అయ్యారు. పారిపోయిన వారిని మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ సిరాజ్, ఆటోనగర్ అక్బర్ బాగ్‌కు చెందిన సయ్యద్ జీషన్‌గా పోలీసులు గుర్తించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు సౌత్ సీఐ తెలిపారు. జిల్లాలోని శివారు ప్రాంతంలోని పోలీసులకు సమాచారం అందించారు.

నాణ్యతా లోపం.. ప్రాజెక్టుకు శాపం

- లోపభూయిష్టంగా ఉడిపివాగు ప్రాజెక్టు మరమ్మతులు
- లీకేజీల కారణంగా వట్టిపోయిన వైనం



నీరు లేక వెలవెలబోతున్న ఉడిపి వాగు ప్రాజెక్టు

మోర్తాడ్(బాల్కొండ): నాణ్యత లేని పనులతో ఉడిపివాగు ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మిషన్ కాకతీయ పథకం కింద రూ. 92.70లక్షలు వెచ్చించి చేపట్టిన మరమ్మతు పనులు బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. లోపభూయిష్టంగా పనులు చేపట్టడంతో నీటి లీకేజీల కారణంగా ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండడం లేదు. దీంతో ఎప్పుడూ వట్టిపోయి కనిపిస్తోంది. ప్రాజెక్టులో జలాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలకు ప్రమాదం ఏర్పడింది.

వేల్పూర్ మండలం రామన్నపేట్ ఉడిపివాగు నీటిని నిలువ చేయడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిన్న తరహా ప్రాజెక్టును నిర్మించారు. ఉడిపివాగు ప్రాజెక్టు ద్వారా రామన్నపేట్ పరిధిలోని వెయ్యి ఎకరాలకు సాగునీటిని నేరుగా అందించడానికి వీలుండేది. ప్రాజెక్టులో నీరు నిలువ ఉంచడం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెంది మరో 1,500ల ఎకరాలకు పరోక్షంగా నీరు అందడానికి అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద నిధులను సమకూర్చింది. కానీ నాసిరకం పనులు చేయడం, చేయని పనులకు బిల్లులను బలవంతంగా చేయించడంతో నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలున్నాయి.

కొట్టుకుపోయిన మత్తడి కిందిభాగం

2016–17లో కొనసాగిన మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు మౌనం కారణంగా ప్రాజెక్టు పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రాజెక్టు మత్తడి కింద భాగం నుంచి నీరు లీకవుతూ పెద్దవాగులో కలిసిపోతోంది. దీంతో వర్షాకాలంలో వచ్చిన నీరు వచ్చినట్లుగా కిందికి వెళ్లిపోతోంది. గత వానాకాలంలో కురిసిన భారీవర్షాలకు మత్తడి కింది భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. కాల్వలు సరిగా లేకపోవడంతో నీటి పారకం తగ్గిపోయింది. ప్రాజెక్టులో నీరు నిలవకపోవడంతో భూగర్భ జలాలు సైతం పడిపోతున్నాయి. పంటలకు నీరందించాల్సిన ప్రాజెక్టు కొందరి ధనదాహంతో అధ్వానంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు మరమ్మతులు పనులపై విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

పనులు మొదలైనప్పటి నుంచే వివాదం..

ప్రాజెక్టు మరమ్మతులు మొదలైన సమయంలోనే వివాదం నెలకొంది. అప్పట్లో అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తడం, పనులు ఎలా ఉన్నా చూసీచూడనట్లు వ్యవహరించి బిల్లులు చెల్లించాలని ఉన్నత శ్రేణి నేతలు ఇంజినీరింగ్ అధికారులపై తీవ్రఒత్తిడి తీసుకువచ్చారు. పనుల్లో నాణ్యత లేకపోతే అంగీకరించబోమని అప్పటి డీఈ ఉదయ్‌కుమార్, జేఈ శ్రీకాంత్ కరాఖండిగా చెప్పారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి భరించలేక డీఈ దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా జేఈ డిప్యూటేషన్‌పై బదిలీ చేయించుకున్నారు. దీంతో ఇన్‌చార్జీలుగా మరో ఇద్దరు అధికారులకు బాధ్యతలను అప్పగించి వారితో బిల్లులు చేయించుకున్నారనే విమర్శలున్నాయి.

మరమ్మతులకు అంచనాలు

ఉడిపివాగు ప్రాజెక్టు మరమ్మతుల కోసం మళ్లీ అంచనాలను తయారు చేశాం. రూ. 80 లక్షల వరకు నిధులు అవసరం అవుతాయి. గతంలో పనులు సరిగ్గా చేయకపోవడంతో ఇప్పుడు భారీగా నిధులు అవసరమవుతున్నాయి. ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తే నీరు నిలువ ఉండడానికి అవకాశం ఉంటుంది.

– ప్రదీప్‌రెడ్డి, జేఈ, నీటిపారుదల శాఖ, వేల్పూర్

రైతులకు రూ. 500 బోనస్ ఇవ్వాలి

- ఎకరానికి రూ. 25 వేల పంట నష్టపరిహారం అందించాలి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాజిరెడ్డి, బిగాల

సుభాష్‌నగర్: యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందడం లేదని, విద్యుత్ కోతలు మొదలయ్యాయన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రస్తున్నారని తెలిపారు. రైతుబంధు కూడా ఐదు ఎకరాల వరకే ఇచ్చారని, అందరికీ వర్తింపజేయాలన్నారు. పంట కోతల వరకూ రైతుబంధు అందించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవాచేశారు. అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, సాగునీరందక ఎండిపోయిందని, వారందరికీ ఎకరానికి రూ. 25వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 115 రోజులైనా గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, గడ్డం సుమనారెడ్డి, బొల్లంక సుమలత గోపాల్‌రెడ్డి, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సూదం రవిచందర్, సుజిత్ ఠాకూర్, కుంచాల రాజు, ప్రేమ్ దాస్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బీఐఎస్ కేర్ యాప్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వినియోగదారులకు నష్టం కలిగేలా చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి కోరారు. ఇందుకు సంబంధించి మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చేతుల మీదుగా బీఐఎస్ కేర్ యాప్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ బంగారు, వెండి ఆభరణాల వ్యాపారస్తులు ఇస్తున్న రశీదులపై హెచ్‌యూఐడీ క్యారెట్ల శాతం రాయకపోవడంతో వినియోగదారులు తమకు నష్టం జరిగిన సందర్భాల్లో వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించలేని పరిస్థితి నెలకొంటోందని కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే మరికొందరు మధ్యతరగతి వ్యాపారులు కొనుగోలుదారులకు పక్కా రశీదులు ఇవ్వకుండా 'కొటేషన్లు' ఇస్తూ తప్పుదోవ పట్టించడంపై చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన కలెక్టర్ లీగల్ మెట్రాలజీ నిబంధనల మేరకు పూర్తి సమాచారం లేని రశీదులు జారీ చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంక్షేమ సమితి అధ్యక్షుడు పెందోట అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ, సంయుక్త కార్యదర్శి కె.సాయికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటిజం పిల్లలకు అండగా ఉంటాం



నిజామాబాద్‌నాగారం: పిల్లల్లో బుద్ధి మాంద్యం, పదేపదే మాట్లాడడం, సరిగ్గా మాట్లాడలేకపోవడమే ఆటిజం లక్షణాలని, అలాంటి వారికి అండగా ఉంటామని జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ అన్నారు. నగరంలోని స్నేహ సొసైటీలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రసూబీ మాట్లాడుతూ.. పిల్లలు ఆటిజం బారిన పడడానికి చాలా రకాల కారణాలు ఉంటాయని, మహిళలు గర్భంతో ఉన్న సమయంలో పోషకాహారం తీసుకోకపోవడం, సరైన మందులు వాడకపోవడం, మత్తుపానీయాలు తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆటిజం బారినపడతారన్నారు. త్వరలో తల్లిదండ్రులకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణుడు విశాల్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, ఆటిజం బారిన పడిన పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో తగ్గించొచ్చు..

నిజామాబాద్‌నాగారం: ప్రపంచ వ్యాప్తంగా ఆటిజం బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని తగ్గించవచ్చని మానసిక వైద్య నిపుణుడు కేశవులు అన్నారు. ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా వ్యాధి బాధిత చిన్నారుల తల్లులకు మంగళవారం కేశవులు అవగాహన కల్పించారు. చిన్నారుల్లో సమస్యను తల్లిదండ్రులు సరైన సమయంలో గుర్తించి వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



తెయూ(డిచ్‌పల్లి): క్రీడల్లో గెలుపోటములు సహజమని, సోదరభావంతో క్రీడల్లో పాల్గొనాలని తెలంగాణ యూనివర్సిటీ పీఆర్‌వో ఏ పున్నయ్య అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌యూఐ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో మంగళవారం కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌ను పీఆర్‌వో పున్నయ్య ప్రారంభించారు. ప్రతి విద్యార్థి జీవితంలో చదువుతోపాటు క్రీడలు ముఖ్యమేనని ఆయన పేర్కొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో ఐఎంబీఏ టీంపై ఇంటిగ్రేటెడ్ అప్లయిడ్ ఎకనామిక్స్ టీం విజయం సాధించింది. వర్సిటీ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శులు సాగర్‌నాయక్, రాజేందర్, ఉపాధ్యక్షుడు మహేశ్‌కుమార్, నిరంజన్, విజయ్,అశ్విన్, నవీన్, శ్రీను రాథోడ్, రాజు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బంగారం వ్యాపారి

భీమ్‌గల్: కరీంనగర్ జిల్లా ధర్మపురి మండలానికి చెందిన కొందరు వ్యక్తుల నుంచి దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేశాడని ధర్మపురి పోలీసులు భీమ్‌గల్ పట్టణానికి చెందిన ఓ బంగారం వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. ధర్మపురి, గొల్లపల్లి గ్రామాల మ ధ్యన ఇటీవల జరిగిన చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుడు అందించిన సమాచారం మేరకు వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. ధర్మ పురి పోలీసులు బంగారం వ్యాపారిని అదుపులోకి తీసుకున్నది వాస్తవమేనని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ముగ్గురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురికి మార్నింగ్ కోర్టు జడ్జి సయ్యద్ ఖదీర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఎంఎస్‌ఆర్ గ్రౌండ్‌లో మార్చి నెల31న ఉదయం మహిళతో ముగ్గురు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తిస్తుండగా, అటుగా వెళ్తున్న ఒకరు డయల్ 100కు ఫిర్యాదు చేశారన్నారు. ఘటనాస్థలానికి చేరుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు.

పదేళ్లలో పలకరించింది లేదు

రైతులను కేసీఆర్ పట్టించుకోలేదు

- ఇప్పుడు పంటలను పరిశీలించడం ఆశ్చర్యమేస్తోంది
- కవిత జిల్లాకు మహిళా డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలను తీసుకురాలేకపోయింది
- మోదీ ప్రకటించిన పసుపు బోర్డు ఎక్కడో స్పష్టత లేదు
- షుగర్ ఫ్యాక్టరీ పేరుతో కొత్త నాటకం ఆడుతున్నారు
- ఎన్నికల్లో కవితకు పట్టిన గతే అర్వింద్‌కు పడుతుంది
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విమర్శలు



కాంగ్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ముఖ్యమంత్రిగా కొనసాగిన పదేళ్లలో కేసీఆర్ ఎక్కడ కూడా రైతులను పలకరించింది లేదని, ఇప్పుడు పంటలను ఆయన పరిశీలించడం ఆశ్చర్యమేస్తోందని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటలకు కనీస మద్దతు ధరను పెంచాలని రైతులు ఢిల్లీ వీధుల్లో ధర్నాలు చేస్తున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ పంట బీమా పథకాన్ని పెట్టకపోవడంతో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోతున్నా పరిహారం అందడం లేదన్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీ హోదాలో కొనసాగిన కేసీఆర్ కూతురు కవిత నిజామాబాద్‌కు మహిళా డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలను తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నిజామాబాద్‌నగరం అభివృద్ధి చెందిందని, బీఆర్‌ఎస్, బీజేపీలు చేసిందేమీ లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే నిజామాబాద్‌కు స్మార్ట్‌సిటీతోపాటు పంట దిగుబడులకు కనీస మద్దతు ధర చట్టం కోసం పోరాటం చేస్తానని ప్రకటించారు. రాష్ట్రంలో కోరుకున్న విధంగానే దేశ ప్రజలు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, పార్టీ సీనియర్ నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, నగేశ్‌గౌడ్, రత్నాకర్, రామర్తి గోపి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్ పాల్గొన్నారు.

కొత్త నాటకం

ఎంపీ అర్వింద్ చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తామని కొత్త నాటకాని తెర లేపారని జీవన్‌రెడ్డి విమర్శించారు. ఎంపీగా కొనసాగిన కాలంలో చెరుకు ఫ్యాక్టరీల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. జగిత్యాల, నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రకటన చేసిన నరేంద్ర మోదీ.. ఎక్కడ ఏర్పాటు చేస్తామనేది స్పష్టం చేయలేదన్నారు. పసుపు బోర్డు నిజామాబాద్‌కు వస్తుందా? లేక అహ్మదాబాద్‌కు వెళ్తుందా? అని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అర్వింద్ ఎక్కడా అభివృద్ధి చేయలేదని, ఎంపీ ఎన్నికల్లో ఎన్నికల్లో కవితకు పట్టిన గతే ఇప్పుడు అర్వింద్‌కు పడుతుందన్నారు.

2025లో చెరుకు గానుగ

రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించేందుకు సిద్ధంగా ఉందని, 2025 డిసెంబర్ నాటికి షుగర్ ఫ్యాక్టరీలో గానుగ ఆడిస్తామన్నాని జీవన్‌రెడ్డి అన్నారు. అంత వరకు రైతులు చెరుకు సాగు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం పంట బీమా పథకాన్ని వర్తింపజేస్తుందని, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, వచ్చే ఖరీఫ్ నుంచి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తామని తెలిపారు.

వారివి కుమ్మక్కు రాజకీయాలు

నన్ను ఓడించేందుకు అర్వింద్, జీవన్‌రెడ్డి కుట్రలు

- గెలిపిస్తే ఎయిర్‌పోర్టుతోపాటు పసుపు బోర్డు తీసుకొస్తా
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు జీవన్‌రెడ్డి, అర్వింద్ కుమ్మక్కయ్యారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. తాను గెలిస్తే కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని ఓడించేందుకు ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయని అన్నారు. మండలంలోని నర్సింగ్‌పల్లిలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు బీఆర్‌ఎస్ నాయకురాలు లక్ష్మక్క మృతికి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. 115 రోజుల పాలనలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని, ముఖ్యంగా రైతుబంధు, రూ.500 బోనస్, విద్యుత్ కోతలు, తదితర వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీలో వెన్నుపోటుదారులను గుర్తించలేదని, రాజకీయంగా, ఆర్థికంగా, వ్యాపారపరంగా లబ్ధి పొంది పార్టీలు మారుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడుతోందని, కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఎన్ని కేసులైనా అండగా ఉంటానన్నారు.

వైఎస్‌తోనే కాంగ్రెస్ చచ్చిపోయింది

వైఎస్ రాజశేఖర్‌రెడ్డితోనే కాంగ్రెస్ చచ్చిపోయిందని, ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నది డూప్లికేట్ కాంగ్రెస్ అని బాజిరెడ్డి అన్నారు. వైఎస్ ఒక్కరే అసలైన కాంగ్రెస్ నాయకుడని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు కాగానే రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లిపోతారని ఆరోపించారు. కేసీఆర్ అసలైన రైతు నాయకుడని అన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో రాష్ట్రంలో పాలన సాగుతోందని ఆరోపించారు.

అర్వింద్‌పై సొంత పార్టీ నేతల్లోనే వ్యతిరేకత

ఐదేళ్లు కాలక్షేపం చేసిన బీజేపీ ఎంపీ అర్వింద్‌ను సొంత పార్టీ నేతలతోపాటు అన్నివర్గాలు వ్యతిరేకిస్తున్నాయని బాజిరెడ్డి అన్నారు. తండ్రీకొడుకులు ఎంపీలుగా జిల్లాకు ఒరగబెట్టిందేమీ లేదని మండిపడ్డారు. పసుపు బోర్డు కేవలం పేపర్‌కే పరిమితమైందని, ఒక్క హామీకూడా అమలు చేయలేదన్నారు. తాను ఎంపీగా గెలిస్తే పసుపు బోర్డు, జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు తీసుకువస్తానన్నారు. 40 రోజులు తన కోసం కష్టపడితే ఐదేళ్లు అండగా ఉంటానన్నారు. అంతకుముందు జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీజీ గౌడ్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ప్రసంగించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్, ఒన్నాజీపేట్ గోవర్ధన్, శ్రీని వాస్‌రావు, నాగేశ్వర్‌రావు, ఉమాపతిరావు, ము త్యంరెడ్డి, నరేశ్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, అజీమ్, మధుకర్, గోపాల్‌రెడ్డి, సిద్ధార్థ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

అడ్డదారిలో భూమి పట్టా

- అమాయకుడి భూమిని కాజేసిన అధికారి!
- అధికారులకు ఫిర్యాదు చేస్తే బెదిరింపులు, హత్యాయత్నం
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు



అక్రమంగా పట్టా చేసుకున్న భూమిలో నిర్మాణం

మాక్లూర్: ఓ ఎక్సైజ్ అధికారి అడ్డదారిలో అమాయకుడి భూమిని కాజేశాడు. తన భార్య పేరుపై ఎకరం నాలుగు గుంటల భూమిని పట్టా చేయించుకున్న సదరు వ్యక్తి ఏకంగా గెస్ట్‌హౌజ్‌ను నిర్మించుకున్నాడు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడిని బెదిరించడంతోపాటు ఇప్పటికే ఓ సారి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మానిక్‌బండార్ తండా శివారులోని వీఆర్‌ఈసీ కళాశాలకు పక్కన 63వ నంబర్ జాతీయరహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో సర్వేనంబర్ 226/పీ1 ఎకరం 4 గుంటలు మానిక్‌బండార్‌కు చెందిన కెలుత్ జానకీబాయికి, 226/పీ2లో ఎకరం 4 గుంటలు దుమ్మిపాడియాకు. 226/పీ3లో ఎకరం 5 గుంటలు రాములుకు, 226/పీ4లో ఎకరం 5 గుంటలు సూర్య మున్నాకు జీవనాధారం కోసం 1985కు ముందు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ భూమిని అమ్మేందుకు, కొనేందుకు వీలులేదు. కానీ కెలుత్ జానకీబాయికి చెందిన ఎకరం 4 గుంటల భూమిని ఓ ఎక్సైజ్ సీఐ ఆక్రమించి, తన భార్య పేరుపై పట్టా చేయించుకొని భవనాన్ని నిర్మించాడని ఆమె మనవడు కెలుత్ గోపాల్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమై సదరు అధికారిని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నాడని, తరచూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాననే ఆగ్రహంతో తనను హత్య చేయించేందుకు యత్నించాడని బాధితుడు తెలిపాడు. ఈ విషయమై పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, కలెక్టర్‌తోపాటు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానని తెలిపాడు. డాక్యుమెంట్లు అన్ని పరిశీలించిన అధికారులు ఆ భూమి నాదేనని చెప్పి.. ఇప్పుడు మాట్లాడడం లేదని, కనీసం కలిసే అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు వారసత్వంగా రావాల్సిన భూమిని తనకు అప్పగించాలని వేడుకుంటున్నాడు.

టూటా ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేయండి

తెయూ(డిచ్‌పల్లి): నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన తెలంగాణ యూనివర్సిటీ టీచర్ అసోసియేషన్ (టూటా) ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ పలువురు అధ్యాపకులు రిజిస్ట్రార్ ఎం యాదగిరిని మంగళవారం కోరారు. అసో సియేషన్ బైలాస్ ప్రకారం ఐదు సంవత్సరాల నుంచి టూటా మనుగడలో లేదని, ఐదేళ్ల నుంచి సభ్యత్వ రుసుము చెల్లించని నేపథ్యంలో టూటా రద్దయినట్లు పరిగణించాలని, ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాని డిమాండ్ చేశారు. క్రియాశీల ఓటర్ల జాబితా లేకుండా నిర్వహించిన ఎన్నిక చెల్లదని భావించాలని కోరారు.

ఏటీయూటీ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

తెయూ అధ్యాపకులు మంగళవారం నూతనంగా 'అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ (ఏటీయూటీ) అడ్‌హక్ కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ప్రొఫెసర్ అపర్ణ, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ సంపత్‌కుమార్, డాక్టర్ వాణి, జాయింట్ సెక్రెటరీగా ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు, డాక్టర్ సుధాకర్, కోశాధికారిగా డాక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీ, కార్యవర్గ సభ్యులుగా ప్రొఫెసర్ ఆరతి, కె రవీందర్‌రెడ్డి, లావణ్య, రాంబాబు ఎన్నికయ్యారు.

స్వామి కల్యాణమంటే లోకకల్యాణం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): స్వామి వారి కల్యాణమంటే లోక కల్యాణమని, వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని తిలకిస్తే సకల పాపాలు తొలగిపోతాయని దేవనాథ జీయర్ స్వామి, గంగోత్రి రామానుజ దాసు స్వామి అన్నారు. మండలంలోని నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి, సినీ హీరో ఆశిష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ప్రముఖ నిర్మాత శిరీశ్, ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, సతీశ్‌రెడ్డి, దుద్దు లింగం, ఎంపీటీసీ రాములు, రవిందర్‌యాదవ్, నర్సారెడ్డి, ప్రసాద్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై స్వామి వారి ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై వేంచేయగా, రథంపై గ్రామంలోని రహదారుల వెంబడి ఊరేగించారు. సిరిసిల్ల గ్రామానికి చెందిన ఒగ్గుడోలు కళాకారుల విన్యాసం చూపరులను ఆకట్టుకుంది. దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాస్ స్వామి, యాజ్ఞాచార్యులు శిఖామణి, శ్రీకర్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఉత్తర తిరుపతి క్షేత్రంలో..

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఉత్తర తిరుపతి క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి నాల్గో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయంలో వసంతోత్సవము, సాయంత్రం ఆలయం నుంచి గూపన్‌పల్లి పరిసర ప్రాంతంలో గరుడ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పరువుపోయిందని యువకుడి ఆత్మహత్య



మచ్చ ప్రవీణ్ (ఫైల్)

డిచ్‌పల్లి: గ్రామంలో అందరి ముందు ఓ మహిళ గొడవ పడి తిట్టడంతో మనస్తాపానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఘన్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ ప్రవీణ్(35)ను అదే గ్రామానికి చెందిన మల్లుబాయి సోమవారం రాత్రి అతని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ముందు తిట్టి గొడవ పెట్టుకుంది. దీంతో తన పరువు పోయిందని మనస్తాపానికి చెందిన ప్రవీణ్ అర్ధరాత్రి ప్రైమరీ స్కూల్ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శివరాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మల్లుబాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వెన్నునొప్పి భరించలేక ..

ఎల్లారెడ్డిరూరల్: వెన్నునొప్పి భరించలేక ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేటకు చెందిన మంగలి యాదమ్మ(54) మూడేళ్లుగా వెన్నునొప్పితో బాధ పడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనంతరం మృతదేహాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించ గా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన రెండ్ల పెంటయ్య (81)కు ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. జీవితంపై విరక్తి చెందిన పెంటయ్య సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న రైలు పట్టాలపై మృతదేహం ఉందన్న సమాచారం మేరకు కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్, సిబ్బంది ఘటన స్థలానికి విచారణ చేపట్టారు.

నిజామాబాద్‌లో..

ఖలీల్ వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన ఇంద్రాల శ్రీనివాస్(56) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేసే శ్రీనివాస్ సోమవారం రాత్రి ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిపోయాడని, సోమవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ..

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ చెరువులో గుర్తు తెలియని మహిళ(45) దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం చెరువులో మహిళ మృతదేహం కన్పించడంతో స్థానికులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. కార్యదర్శి సునీల్ ఫిర్యాదు మేరకు చెరువు వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. ఒడ్డుపై ఉన్న బ్యాగులో దుస్తులున్నాయి. చెప్పులు ఒడ్డుపైనే వదిలి మహిళ నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి వివరాలు ఎవరికైనా తెలిస్తే డిచ్‌పల్లి సీఐ 8712659851, ఎస్సై 87126 59852 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

మద్యానికి బానిసై..



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన బొరెడ్డి వంశీరెడ్డి మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లివచ్చిన వంశీరెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తనకు బైక్ కొనివ్వాలని కొన్నిరోజులుగా తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. మద్యానికి బానిసైన వంశీ ఈక్రమంలో మంగళవారం కుటుంబ సభ్యులతో ఫోన్‌లో వాగ్వాదానికి దిగి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

- ఒకరి మృతి, పలువురికి స్వల్ప గాయాలు



సులోచన (ఫైల్)

నవీపేట: కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలైన ఘటన మండలంలోని జగ్గారావ్ ఫారం శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కోటగల్లీకి చెందిన సుదర్శన్, సులోచన(45) దంపతులతో పాటు అదే కాలనీకి చెందిన కవిత, శారదా, అనిత సుదర్శన్‌కు చెందిన కారులో ధర్మాబాద్‌కు వెళ్లారు. అక్కడ కారంమిల్లులో మిర్చి కారం పట్టుకుని తిరుగుపయనమయ్యారు. జగ్గారావ్ ఫారం శివారులో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో సులోచన అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు మనీష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి అదృశ్యం



అరవింద్

కామారెడ్డి క్రైం: పట్టణంలోని కల్కినగర్ కాలనీకి చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. కాలనీకి చెందిన మల్లారెడ్డి అరవింద్ అనే 12 ఏళ్ల బాలుడు దౌల్తాబాద్ హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం కామారెడ్డికి వచ్చాడు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో జీవదాన్ పాఠశాల నుంచి తన తమ్ముడిని తీసుకురావడానికి వెళ్లి తిరిగి రాలేదు. ఆలస్యం కావడంతో కుటుంబీకులు పాఠశాలకు వెళ్లగా అరవింద్ రాలేదని చెప్పారు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గూపన్‌పల్లికి చెందిన బాలుడు..



నిజామాబాద్‌రూరల్: మండలంలోని గూపన్‌పల్లి వాగు గడ్డ ప్రాంతానికి చెందిన చెన్నయ్య డానియల్ అనే బాలుడు అదృశ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ కుమార్ మంగళవారం తెలిపారు. గత నెల 15న కట్టెల కోసం ఇంటి నుంచి వెళ్లిన డానియల్ తిరిగిరాకపోవడంతో తల్లి లక్ష్మి చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికింది. డానియల్ ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. డానియల్ ఆచూకీ తెలిసిన వారు 87126 59849, 87126 59735 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన వీరమల్లి శ్రీనుబాబు ఇంట్లో షట్టర్‌లో రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో 18 క్వింటాళ్ల 64 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించగా డిప్యూటీ తహసీల్దార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కిష్టయ్య వచ్చి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

బాన్సువాడలో..

బాన్సువాడ: మండల కేంద్రంలోని ఓ గోదాంలో 7.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య మంగళవారం తెలిపారు. ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు గౌలీగూడలో అబ్దుల్ రహీంకు చెందిన గోదాంలో దాడి చేయగా 15 బస్తాల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం రహీంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం విక్రయిస్తే చర్యలు తప్పవని అన్నారు.

రూ. 2లక్షల నగదు పట్టివేత



చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో పోలీసులు

నిజాంసాగర్(జుక్కల్): సంగారెడ్డి– నాందెడ్ జాతీయ రహదారిపై వెల్గనూర్ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.2 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన రామచంద్రారెడ్డి తన వాహనంలో రూ.2 లక్షల నగదుతో ఎల్లారెడ్డి వైపు వెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

తండాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

మాచారెడ్డి: మండలంలోని సోమారంపేట, నెమిలి గుట్ట తండాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడి చేసి 8.5లీటర్ల నాటు సారా, 200లీటర్ల ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య తెలిపారు. నెమిలిగుట్ట తండాకు చెందిన హీన అనే మహిళ నాటు సారాను తయారు చేసి సోమారంపేట గ్రామానికి చెందిన చిట్టవోయిన నర్సయ్యకు ఇవ్వగా, పక్కా సమాచారం మేరకు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీ స్టాల్‌లో చోరీ

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలోని గంగోళ్ల రమేశ్‌కు చెందిన టీ స్టాల్‌లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. తాళం పగులగొట్టి టీస్టాల్‌లోకి ప్రవేశించిన దుండగులు రూ.3,480 నగదు, ఫోన్, కంప్యూటర్ మానిటర్ ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కెనాల్‌లో పడి యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ ప్రమాదవశాత్తు నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బంధువు అంత్యక్రియలకు వెళ్లిన శ్రీకాంత్ స్నానం చేసేందుకు కాలువలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు పడి నీట మునిగి మృతి చెందాడు. ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉండగా, భార్య నిఖిత ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. శ్రీకాంత్ మృతితో వారు దిక్కులేనివారయ్యారని గ్రామస్తులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.